క్లుప్తంగా

రంజాన్ తోఫా పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రంజాన్ పండుగ వేడుకలు పేదలు సైతం సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ ముస్లీం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఖాదర్ బాషా అన్నారు. ప్రభుత్వం ఖాజీ హబీబుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో 1000 మంది పేద ముస్లిలకు బియ్యం, కందిపప్పు, సేమియా, గోదుమ పిండి, చెక్కెర, నూనెతో కూడిన రంజాన్ తోఫా ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ముస్లిం పెద్దలు ఖాదర్ బాషాను సన్మానించారు. ప్రభుత్వ ఖాజీ హబీబుల్లా హుస్సేనీ, షాబూఖారీ దర్గా మతగురువు మమ్మద్ ఆల్తాఫ్ రజా, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు యరమల నరసింహారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. వెల్వడం గ్రామానికి చెందిన వెల్లంకి కృష్ణకు రూ.లక్ష, గుంజి జమలయ్యకు రూ.20 వేలు చెక్కును అందజేశారు.

ప్రచారభేరి పోస్టర్ల ఆవిష్కరణ



తిరువూరు: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రప్రభుత్వంపై వామపక్షాలు ఉమ్మడి పోరాటం చేస్తాయని సీపీఐ సీనియర్ నాయకులు తూము కృష్ణయ్య అన్నారు. తిరువూరు సీపీఐ కార్యాలయంలో ఆదివారం మోదీ హటావో – దేశ్ కీ బచావో కార్యక్రమ ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పేదవర్గాలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో మెరక పనులు



ఇబ్రహీంపట్నం: శక్తినగర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద మెరక పనులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తన సొంత నిధులతో చేపట్టారు. ఇటీవల కమ్యూటీ హాల్ ప్రాంగణం లోతట్టుగా ఉన్నందున వర్షాలు వచ్చిన సమయంలో జలమయం అవుతుందని, సామాజిక కార్యక్రమాలకు ఆటంకంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు ఎమ్మెల్యే వసంతకు వివరించారు. తక్షణమే స్పందించిన ఆయన తన సొంత నిధులతో లారీలతో డస్ట్ తోలించి జేసీబీతో చదును చేయించారు. అడిగిన వెంటనే పనులు చేయించిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నల్లమోతు చిన్నయ్య, ప్రకాష్, కోలకాని శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు.

కరోనాకు అడ్డుకట్ట వేద్దాం

చాట్రాయి: కరోనా వైరస్ నివారణకు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి లీనా బెంజిమెన్ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చీపురుగూడెం, పోలవరం గ్రామాల్లో ఇద్దరికి కరోనా పాజిటివ్ వచ్చిందని.. అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

వృద్ధులను ఆదరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యత అని డాక్టర్ ఎన్ఆర్ఎస్ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయి సుధాకర్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత వేముల భానుప్రకాష్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. 190 నెలలుగా వృద్ధులకు సేవలు అందిస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ వేముల భానుప్రకాష్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో తాను భాగస్వామి కావటం ఆనందంగా ఉందన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ, సీనియర్ జర్నలిస్ట్ కరణం కళ్యాణ్‌కృష్ణ కుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు, ఉపాధ్యాయురాలు కె.రమాగాయత్రి మాట్లాడారు. అనంతరం వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

1962కు ఫోన్ చేస్తే.. క్షణాల్లో పశువైద్యం

రైతు ఇంటి ముంగిటికే వైఎస్సార్ పశువైద్య సేవలు



మైలవరంలో ఓ రైతు ఇంటి వద్దే పశువులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

మైలవరం: 1962కు ఫోన్ కొట్టు.. క్షణాల్లో రైతుల ఇంటి ముంగిటికే పశు వైద్యం అందుబాటులోకి వచ్చేస్తుంది. గతంలో పశువులు, మూగజీవాలకు ప్రాణాపాయం జరిగి, పశుపోషకులకు తీవ్ర నష్టం జరిగేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్యకు చెక్ పెట్టారు. అత్యవసర పరిస్థితుల్లో మారుమూల ప్రాంతాలకు పశువైద్య సేవలు, పునరుత్పత్తి సేవలు అందించేందుకు ప్రభుత్వం పశు సంవర్ధ శాఖ ద్వారా డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి రెండు సంచార పశు వైద్యశాల వాహనాలు అందుబాటులో ఉంటాయి. పశువులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించడమే గాక అత్యాధునిక పద్ధతి ద్వారా సెమెన్ ఎక్కించి రైతు కోరుకున్న విధంగా వారి పశువులకు ఆడ, మగ దూడలకు జన్మనిస్తున్నారు. జాతీయ వ్యవసాయ కమిషన్ 1976 సిఫార్సుల మేరకు ప్రతి ఐదు వేల పశువుల యూనిట్లకు ఒక పశు వైద్యుడు ఉండాలని సూచించింది. ఈ ప్రాతిపదికన మారుమూల ప్రాంతాల్లోని పశు పోషకులకు సైతం పశు వైద్యం అందించాలనే లక్ష్యంతో సంచార పశు ఆరోగ్య సేవల వాహనాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చారు.

మైలవరం మండలంలో 40,258 పశువులు

నియోజకవర్గంలో జూలై 2022 నాటికి మైలవరం మండలంలో 40,258 పశువులు, 10,600 మూగజీవాలు ఉండగా ఇబ్రహీంపట్నం మండలంలో 10,693 పశువులు, 13,668 మూగజీవాలు, జి.కొండూరు మండలంలో 13,114 పశువులు, 886 మూగజీవాలు, రెడ్డిగూడెం మండలంలో 8,126 పశువులు, 256 మూగజీవాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అత్యాధునిక సంచార పశు వైద్య వాహనాలలో అవసరమైన సందర్భంగా వాహనంలో ఉన్న క్రేన్ ద్వారా పశువును గ్రామం నుంచి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్సలందిస్తున్నారు.

3,200 పశువులకు వైద్యం

మైలవరంలో వైఎస్సార్ సంచార పశు వైద్య వాహనం సేవలను 2022 మే 20న ప్రారంభించారు. వాహనంలో వాహన ఇన్‌చార్జి డాక్టర్ ఒకరు, ముగ్గురు స్టాఫ్ ఉంటారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 16 గ్రామాలు సందర్శించి, 3,200 పశువులకు వైద్య సేవలు అందించాం. ముఖ్యంగా పశువులకు జ్వరం, దోమకుంటు వ్యాధి సోకుతుంది, పాదుగు వాపు వ్యాధి వస్తుంది. యాంటీ బయాటిక్, తరచూ వచ్చే రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయి. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు రెండు వాహనాలు ఉన్నాయి. సిబ్బంది ఉన్నారు. 1962కు కాల్ చేస్తే ఇంటి ముంగిటకే వాహనం వస్తుంది.

– డాక్టర్ హరినాథ్, వెటర్నరీ ఏడీ, మైలవరం

అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలం



మర్రిబంధంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ కార్యకర్తలు

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు ఆరోపించారు. మండలంలోని చీపురుగూడెం, మర్రిబంధం, కోటపాడు, సి.గుడిపాడు గ్రామాల్లో ప్రజా చైతన్య ఉద్యమాన్ని జయప్రదం చేయాలంటూ ఆదివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతపరమైన విభజన చేయడానికి బీజేపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ రాజేంద్రప్రసాద్, లాజరు, జి.నారాయణ, ఆనందరావు పాల్గొన్నారు.

నూజివీడు–బెంగళూరు బస్సు పునరుద్ధరణ



బస్ సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం పవన్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ

నూజివీడు: ఇటీవల రద్దు చేసిన నూజివీడు–బెంగళూరు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎట్టకేలకు పునరుద్ధరించారు. బెంగళూరు బస్సు రద్దు చేసి ఇక్కడి బస్సును వేరే డిపోకు తరలించిన వైనంపై వారం రోజుల క్రితం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆర్టీసీ ఈడీ ఆపరేషన్స్‌తో మాట్లాడారు. డిపోను నిర్వీర్యం చేసే పనుల్లో భాగంగా దూరప్రాంత సర్వీసులను రద్దు చేస్తే తాను సహించనని, రద్దు చేసిన బెంగళూరు బస్సు సర్వీసును పునరుద్ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. అవసరమైతే స్లీపర్ కోచ్‌లను, సెమీ స్లీపర్ కోచ్‌లను ఏర్పాటు చేయాలి తప్ప, రద్దు చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రద్దు చేసిన బెంగళూరు సర్వీసును ఆదివారం ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్ కొడవటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి సతీష్ పాల్గొన్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం ఇవ్వాలి



మైలవరంలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది




నూజివీడులో గ్యాస్ సిలిండర్ల వద్ద మంటలు ఆర్పడాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మైలవరం: అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం మైలవరం రాజ్యలక్ష్మి అపార్ట్‌మెంట్స్, శశి అపార్ట్‌మెంట్స్, బైపాస్ రోడ్‌లో అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం గమనించి ప్రతి ఒక్కరూ ఆరు బయటికి సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలన్నారు. విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకుంటే నీళ్లతో ఆర్పవద్దన్నారు. దీని వలన ప్రాణాపాయం సంభవిస్తుందన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు వాడే వివిధ రకాల పరికరాలను ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

నూజివీడు: అపార్ట్‌మెంట్లలో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ కే భాస్కరరామం సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బీవీఆర్ టవర్స్‌లో ఆదివారం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంట్లో ఉన్న ఎల్‌పీజీ సిలిండర్ వల్ల ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలా ఎదుర్కొనాలనే దానిపై మాక్ డ్రిల్ చేసి చూపించి అవగాహన కల్పించారు.

ఆహార నియమాలతో సంపూర్ణ ఆరోగ్యం



జేవీవీ వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

తిరువూరు: క్రమం తప్పని వ్యాయామం, ఆహార నియమాలు పాటించడంతో ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చని విజయవాడకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు రమేష్ సూచించారు. తిరువూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాగార్జున స్కూల్ ఆవరణలో మధుమేహరోగుల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని సందర్శించిన రమేష్ మాట్లాడుతూ రక్తపోటు అధికంగా ఉండటం, మధుమేహం బారిన పడటానికి ప్రధాన కారణం ఆహారపు అలవాట్లేనని, ఉప్పు, పంచదార తగ్గిస్తే ఈ వ్యాధులు రావని సూచించారు. ఈ శిబిరంలో 1100 మంది రోగులను వైద్యులు రవీంద్ర, రాజేశ్వరి, రాఘవరావు, సత్యతేజ పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, జన విజ్ఞాన వేదిక వలంటీర్లు వైద్యశిబిర నిర్వహణలో సహకరించారు.

వైద్యరంగంలో వినూత్న మార్పులు

తిరువూరు: వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రోగులకు వైద్యసేవలందించాలని ప్రముఖ కార్డియాలజిస్టు రమేష్ సూచించారు. తిరువూరు వీ కన్వెన్షన్‌లో ఆదివారం విజయవాడ రమేష్ హాస్పిటల్స్, తిరువూరు అమరావతి హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన వైద్యుల సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పులతో ఆధునిక యంత్రపరికరాలు వైద్యరంగంలో సైతం ప్రవేశించాయని, రోగులకు సత్వరం, మెరుగైన వైద్యసేవలందించగలుగుతున్నామన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరువూరు శాఖ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, వైద్య నిపుణులు రమేష్, విజయలక్ష్మి, జయకృష్ణ పాల్గొన్నారు. అమరావతి ఆస్పత్రి చైర్మన్ కోనేరు కృష్ణన్ పర్యవేక్షించారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు.

నూజివీడులో..

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

రెడ్డిగూడెం: మండలంలో ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ ఆదివారం తెలిపారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులు 200 యూనిట్లు దాటిన ప్రతిఒక్కరూ బిల్లు కట్టివలసిందని పేర్కొన్నారు. ప్రతినెలా బిల్లులు తప్పనిసరిగా చెల్లించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం సబ్ స్టేషన్ పరిధిలోని బైపాస్ ఫీడర్ నందు విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్ తెలిపారు. సూరిబాబు పేట, పోలీస్ స్టేషన్ ఏరియా, చంద్రబాబు నగర్, అంబేద్కర్ నగర్,మాదాసు కాలనీ, బస్టాండ్ వెనుక, రాజాపేట, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, శివాలయం రోడ్డు, కుమ్మరివీధి, ప్రభుత్వ బాలికల హైస్కూల్ రోడ్, నూజివీడు రోడ్, బైపాస్ రోడ్, ఆల్ఫా సెంటర్, దేవుని చెరువు, హాజీపేట, మార్కెట్ యార్డు, చిన్నగూడెం పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సమావేశం ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.మురళీ మోహనరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రైతు జీవన వేదనకు అద్దం పట్టిన 'మట్టిబండి గ్రంథం'

విజయవాడకల్చరల్: రైతు జీవన వేదనకు అద్దం పట్టిన దీర్ఘకవిత మట్టిబండి కవితా గ్రంథమని ఏపీ అసెంబ్లీ చీఫ్ విప్ ఓఎస్డీ డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, ఫొటో ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ రచించిన మట్టిబండి దీర్ఘకవిత గ్రంథ పరిచయ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. అంతులేని రైతు జీవన యానంలో అనేక సంఘటనలకు సాక్షిగా మట్టిబండి కవితా సంపుటి నిలిచిందన్నారు. సమాజం స్వరూపం మార్చకలిగిన వాడు రైతు మాత్రమేనని నేటి ఆధునిక సమాజంలో రైతు జీవితం దుర్భరంగా మారిందని ఆది మారాల్సిన అవసముందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ.. మినీ కవితలో చెప్పలేని అంశాలను దీర్ఘ కవితలో వివరించవచ్చునని దీర్ఘ కవితా అవసరాన్ని వివరించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుత్తి కొండ సుబ్బారావు మాట్లాడుతూ రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా జీవిత విశేషాలను వివరించారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు కవితా సంపుటిలోని విశేషాలను వివరించారు. పరిచయ సభ కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, ఫొటో ఇండియా వ్యవస్థాపకుడు డాక్టర్ తమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వెన్నా వల్లభరావు, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం నిర్వాహకురాలు తేళ్ల అరుణ, డాక్టర్ వి.సింగారావు పాల్గొన్నారు.

తిరువూరు పట్టణాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: పెరుగుతున్న జనాభా అవసరాలకనుగుణంగా తిరువూరు పట్టణంలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. ఆదివారం తిరువూరు 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని సమస్యలు తెలుసుకుని నగరపంచాయతీ అధికారులు సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్లను అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణా నదీ జలాల సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు మంజూరైందని, రూ.160 కోట్లతో ప్రజల దాహార్తి తీర్చనున్నామని వెల్లడించారు. ఇటీవల తిరువూరు వచ్చిన ముఖ్యమంత్రి సైతం అభివృద్ధి పనుల నిర్వహణకు నిధులు కేటాయించడానికి హామీ ఇచ్చారన్నారు. నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, వార్డు కన్వీనర్ గజ్జల సీతారామారావు పాల్గొన్నారు.

చంద్రబాబు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆగిరిపల్లి: చంద్రబాబునాయుడు ఎవరో ఇచ్చిన స్క్రిప్టును చదివి మాట్లాడటం మంచిది కాదని నిజాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని ఆగిరిపల్లి మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఇటీవల నూజివీడు వచ్చిన చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుపై అసత్య ఆరోపణలు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఆగిరిపల్లిలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూజివీడు టీడీపీ ఇన్‌చార్జి గాని, చంద్రబాబు గాని, టీడీపీ నాయకులు గాని ఎమ్మెల్యే ఫారెస్టు భూములు ఆక్రమించుకున్నట్లు, ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు ఆధారాలతో నిరూపిస్తే తాము పార్టీకి రాజీనామా చేస్తామని, టీడీపీ నాయకులు నిరూపించలేకపోతే వారు కూడా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఇలాగే అసత్య ఆరోపణలు చేశారని కాని నిరూపించలేక పోయారన్నారు. వందల ఎకరాలు దానం చేసిన చరిత్ర ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావుదన్నారు. ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే కాని ఒక్క ట్రాక్టర్ ఇసుక బయటకు రాదని, అలాంటిది రోజుకు 300 ట్రాక్టర్లు ఇసుక దందా అని చంద్రబాబు అవగాహన లేకుండా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. తోటపల్లిలో క్వారీ విషయంలో ఇప్పటికే అనేకసార్లు చెప్పామన్నారు. తమ నాయకుడికి ఎలాంటి క్వారీలు లేవని, ఉన్న క్వారీలు టీడీపీ వాళ్లవేనని స్పష్టం చేశారు. దమ్ముంటే నిరూపించాలని అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, సీతారామపురం సర్పంచ్ అత్తి మురళీ, ఆగిరిపల్లి ఎంపీటీసీ–2 సభ్యుడు సాదం గోపీనాథ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీమన్నారాయణ, నెరుసు రాజేష్ పాల్గొన్నారు.

బాబూరావు మాస్టారుకు పూలే ఎక్సలెన్స్ అవార్డు



తిరుపతిలో అవార్డు స్వీకరిస్తున్న బాబూరావు మాస్టారు

ముసునూరు: భావి భారత పౌరులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న కృషిని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు గుర్తించడం మహదానందంగా ఉందని జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ 2023 అవార్డు గ్రహీత ముసునూరు సిల్క్ నగర్ స్కూల్ హెచ్ఎం కొప్పుల బాబూరావు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలోని పూలే టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, సీనియర్ పాత్రికేయుడు, కవి ఇంద్రవల్లి రమేష్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. అవార్డు గ్రహీతను ఎంఈఓ పి.రత్నకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, ఎంపీపీ రాపర్ల కృష్ణ కుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ అభినందించారు.

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడికి సన్మానం



చరణ్‌కు సన్మానం

ముసునూరు: క్రైస్తవులంతా ప్రేమ, శాంతి, ఐక్యతా మార్గాల్లో జీవించాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ సూచించారు. ముసునూరులోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిర ప్రాంగణంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తమ్, ప్రభు కిషోర్‌ల ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు కంబాల రాంబాబు అధ్యక్షతన క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితుడైన పిల్లా చరణ్‌ను ఆదివారం సన్మానించారు. ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు రాజు, దావీదు రాజు, కోశాధికారి దాసు, కమిటీ సభ్యులు శ్యాంసన్, బాలస్వామిల ఆధ్వర్యంలో ఆయనకు జ్ఞాపికలు బహూకరించారు.

గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' సందడి



ఇబ్రహీంపట్నంలో మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ గోడకు అంటిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శివారెడ్డి

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సందడిగా సాగుతోంది. కొండపల్లి మున్సిపాల్టీ సచివాలయ కన్వీనర్లు కోఆర్డినేటర్లు కోసూరు వెంకటేష్, లంకే అంకమోహనరావు గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు, ఫోన్‌కు, ఇంటి తలుపులకు అంటించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలోని ఊటుకూరులో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఆలపాటి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు డీఎస్ఆర్, కాజా నాగేంద్రరావు, సంగీతం రాఘవయ్య పాల్గొన్నారు. తునికిపాడులో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం ముగిసినట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఈ నెల 20వ తేదీనాటికి ముగించాలని పార్టీశ్రేణులకు ఆయన సూచించారు.

ఆస్తిపన్నుపై ఐదు శాతం రాయితీ

తిరువూరు: ఆస్తి పన్ను చెల్లింపులో ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నందున తిరువూరు పట్టణ భవన యజమానులు వినియోగించుకోవాలని నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 30వ తేదీ లోపు పన్నులు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఇస్తామని, తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లో సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.